ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 138 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 24 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# రామేశ్వరం తీరంలో రహస్య కెమెరా కలకలం

## ..దుస్తులు మార్చుకోవడానికి వెళ్లి గుర్తించిన మహిళ

దైవ దర్శనానికి రామేశ్వరం వెళ్లిన ఓ మహిళకు చేదు అనుభవం ఎదురైంది.



**డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన రామేశ్వరంలో ఓ భక్తురాలికి చేదు అనుభవం ఎదురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుదుకోట్టైకి చెందిన మహిళ కుటుంబసమేతంగా సోమవారం రామేశ్వరం దేవాలయానికి వెళ్లారు. ఆలయ ఆచారాల్లో భాగంగా అగ్నితీర్థం వద్ద సముద్రస్నానం చేసి.. దుస్తులు మార్చుకోవడానికి ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటుచేసిన గదిలోకి వెళ్లారు. అయితే అందులో రహస్యంగా దాచిఉంచిన కెమెరాలను ఆమె గుర్తించి కుటుంబసభ్యులకు, ఆలయ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.కెమెరాలను స్వాధీనం చేసుకొని.. బూత్ నిర్వాహకుడు రాజేష్ను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణలో సమీపంలోని టీ స్టాల్లో పనిచేస్తున్న మీరా మొయిదీన్ అనే వ్యక్తి కూడా రాజేష్కు సహకరించినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఆలయ పరిసరాలలో ఇటువంటి చర్యలు జరగడం బాధాకరమని.. మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

# ధరలు పెరుగుతుంటే

## .. ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతోంది: రాహుల్

దేశంలో ధరల పెరుగుదలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు.



**దిల్లీ, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ (కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్ర పోతోందంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.'కొన్ని రోజుల క్రితం స్థానిక కూరగాయల మార్కెట్కు వెళ్లాను. అక్కడ సామాన్యులను కలిసి మాట్లాడాను. పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న విషయాలకు వారు రాజీ పడాల్సి వస్తుంది. గతంలో రూ.40 ఉండే కిలో వెల్లుల్లి ధర ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. ఇలా ధరలు పెరిగిపోతుంటే.. ప్రజలు ఇంక పొదుపు ఏం చేయగలుగుతారు. ద్రవ్యోల్బణం పెరగడంతో సామాన్యుడి వంట గది బడ్జెట్ వారి చేయి దాటిపోతోంది. కేంద్రప్రభుత్వం ధరలను నియంత్రించకుండా.. కుంభకర్ణుడిలా నిద్రపోతోంది' అని విమర్శించారు.రాహుల్ గాంధీ ఇటీవల గిరినగర్ లోని కూరగాయల మార్కెట్ను సందర్శించారు. అక్కడ సామాన్యులతో ధరల పెరుగుదలపై చర్చించారు. అంతేకాకుండా దానివల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ధరలు పెరగడంతో ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సి వస్తుందని ఈసదర్భంగా కొందరు మహిళలు రాహుల్ కు తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

# ఆ రాకాసి సునామీ నుంచి బయటపడి .. 'బేబీ 81' కథ తెలుసా?

2004లో సునామీ సృష్టించిన విధ్వంసంలో శ్రీలంక తీరంలో కొట్టుకుపోయిన చిన్నారి 'బేబీ 81' కథ తెలుసా..?



**కొలంబో, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** సరిగ్గా 20 ఏళ్ల క్రితం సంభవించిన సునామీ భారత్, ఇండోనేషియా సహా చాలా దేశాల్లో బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో శ్రీలంక తీరంలో రెండు నెలల చిన్నారి జయరస అభిలాష్ కొట్టుకుపోయాడు. మట్టిలో కూరుకుపోయిన ఆ చిన్నారి అదృష్టవశాత్తూ మృత్యుంజయుడిగా నిలిచాడు. 'బేబీ 81'గా 81) పేరొందిన ఆ సునామీ బాబు కథ తెలుసుకుందాం.సునామీ కారణంగా శ్రీలంకలో 35 వేల మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పో-యారు. ఎంతోమంది తమ కుటుంబాల నుంచి విడిపోయారు. అదే సమయంలో తీరంలో రెండు నెలల బాబు కొట్టుకుపోయాడు. అధికారులు, కుటుంబం అతడి కోసం మూడు రోజుల పాటు వెతికినా ఎక్కడా జాడ గుర్తించలేకపోయారు. ఓ ఇంటి సమీపంలో మట్టిలో కూరుకుపోయి.. చిన్నారి కదలికలను గుర్తించిన కొందరు బాబును రక్షించి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అతడికి నంబర్ 81 కేటాయించారు. దాంతో 'బేబీ 81'గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. కొన్ని రోజుల తర్వాత ఆ బాబు తమ కుమారుడే అంటూ తొమ్మిది కుటుంబాలు ముందుకువచ్చాయి.చివరికి తల్లిదండ్రుల చెంతకు..చిన్నారి అసలైన తల్లిదండ్రులు ఎవరనే అంశంపై కోర్టులో విచారణలు కొనసాగాయి. చివరికి డీఎన్ఏ పరీక్షల ద్వారా చిన్నారి జయరస అభిలాష్ తల్లిదండ్రుల చెంతకు చేరాడు. 'బేబీ 81'గా పేరొందిన చిన్నారి కథ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం 20 ఏళ్ల ఆ యువకుడు హైస్కూల్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయనున్నాడు. ప్రస్తుతం పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివేందుకు ఆసక్తిగా ఉందని అభిలాష్ తెలిపారు."ఆస్పత్రిలో ఉన్న నా బిడ్డ కోసం ఎంతోమంది పోటీపడ్డారు. కోర్టు డీఎన్ఏ పరీక్ష చేయాలంటూ ఆదేశించడంతో మిగిలిన కుటుంబాలు ముందుకురాలేదు. అప్పుడే అతడు నా కుమారుడేననే నమ్మకం కలిగింది. ఫలితాలు కూడా మాకు అనుకూలంగా వచ్చాయి. నాడు మా ఆనందానికి అవధుల్లేవు. అయితే.. స్కూల్లో అభిలాష్ను 'బేబీ 81'గా తోటి విద్యార్థులు ఆట పట్టించడంతో అతడు కాస్త ఇబ్బందికి గుర-య్యాడు. ఆ తర్వాత తన ఆత్మస్థైర్యాన్ని మరింత బలంగా మార్చుకున్నాడు" అని అభిలాష్ తండ్రి మురుగుపిళ్లై పేర్కొన్నారు.

# ఎన్నికల నిబంధనల్లో మార్పులు

## .. సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్

ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నిబంధనల్లో మార్పులు చేయడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.



**డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నిబంధనల్లో మా-ర్పులు చేయడాన్ని వ్యతిరేకిస్తోన్న కాంగ్రెస్.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ చర్యల వల్ల ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు భంగం కలగవచ్చని కాంగ్రెస్ పేర్కొంది. ఎన్నికల కమిషన్ ఇటీవల చేసిన సవరణలను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేసింది.ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం ఇటీవల మార్పులు చేసింది. పోలింగ్కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్ను, వెబ్కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు.. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2) (ఏ)ను కేంద్ర న్యాయశాఖ సవరించింది.ఇదీ చదవండి: ధరలు పెరుగుతుంటే ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతోంది: రాహుల్ ఈ చర్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఇదే అంశం పై ఏఐసీసీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్.. సుప్రీం కోర్టులో తాజాగా రిట్ పిటిషన్ దాఖలు చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్.. ఏకపక్షంగా, ప్రజలతో సంప్రదింపులు లేకుండా ఎన్నికల ప్రక్రియ నిబంధనల్లో మార్పులు చేయడం దారు-ణమన్నారు.ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను ఏకపక్షంగా తొలగించడం లేదా చేర్చడం వంటి చర్యలకు పాల్పడలేదని కేంద్ర ఎన్నికల సంఘం కాంగ్రెస్కు తెలిపింది. ఓటర్ల జాబితా తయారీలో పాదర్శకత, నిబంధనలు పాటించినట్లు పేర్కొంది. మహారాష్ట్రలో ఓటర్ల తొలగింపులో అవతవకలు జరగలేదన్న ఈసీ.. కాంగ్రెస్ ప్రతినిధుల భాగస్వామ్యంతో పాటు తగిన ప్రక్రియను అనుసరించామని తెలిపింది.

# కేరళలో న్యూక్లియర్ పవర్స్టేషన్ ఏర్పాటు!

కేరళలో అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు నిమిత్తం రాష్ట్ర మంత్రి కృష్ణన్కుట్టి కేంద్ర మంత్రి మనోహర్లాల్ ఖట్టర్తో సమావేశమయ్యారు.



**తిరువనంతపురం, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** కేరళ లో అణువిద్యుత్ కేంద్రం స్థాపించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ విషయంపై ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కె. కృష్ణన్కుట్టి, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో అత్యున్నత స్థాయి చర్చల్లో పాల్గొన్నట్లు తెలిపాయి. తమ రాష్ట్రంలో సమృద్ధిగా ఉన్న థోరియం నిక్షేపాలను సద్వినియోగం చేసుకొని.. వాటినుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ను కేరళకు సరఫరా చేయాలని కేంద్ర మంత్రికి సమర్పించిన మెమోలో పేర్కొన్నట్లు వివరించాయి. కేంద్ర ప్రభుత్వం అణు విద్యుత్ను మంజూరుచేసే ఆలోచనకు సిద్ధంగా ఉందని.. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరిస్తే న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం అవుతుందని మనోహర్ లాల్ ఖట్టర్ సూచించినట్లు పేర్కొన్నాయి.కేరళ విద్యుత్ లోటును ఎదుర్కొంటూ పక్క రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో న్యూక్లియర్ పవ . ప్లాంట్ ఏర్పాటు గురించి నిర్ణయం తీసుకోవాలని కేంద్రమంత్రి సూచించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విషయం చర్చల దశలోనే ఉందని.. దీనికోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. మరోవైపు రాష్ట్రంలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఏర్పాటును కేరళ రాష్ట్ర ప్రభుత్వం కోరలేదని, రాష్ట్రంలోని థోరియం నిక్షేపాలను కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకోవాలని మాత్రమే సూచించిందని రాష్ట్ర విద్యుత్ మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొనడం గమనార్హం.ఈ సమావేశం గురించి మంత్రి కె. కృష్ణన్కుట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్థికసాయం కోరామని తెలిపారు. "ప్రభుత్వ అంచనాల ప్రకారం 2030 నాటికి కేరళకు దాదాపు 10,000 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుంది. స్థానికంగా ఇంత పెద్ద మె-ుత్తంలో ఉత్పత్తి చేయడం జరగని పని. కాబట్టి కేంద్రం లేదా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 4,260 మెగావాట్ల సరఫరాను మాత్రమే నిల్వ చేసే సదుపాయాలు ఉన్నాయి. మరింత విద్యుత్ కొనుగోలు చేయడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు మనకు లేవు. అందువల్ల కేంద్రప్రభుత్వం నుంచి ఆర్థికసాయం కోరాము" అని వెల్లడించారు.అంతేకాకుండా బార్హ్ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి 177 మెగావాట్ల విద్యుత్ సరఫరా కాంట్రాక్టు మార్చి వరకే ఉందని.. దానిని జూన్ వరకు పొడిగించాలని కేంద్రాన్ని అభ్యర్థించామన్నారు. సరఫరాను 177 మెగావాట్ల నుంచి 400 మెగావాట్లకు పెంచాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# తెలంగాణలో 3 రోజుల పాటు తేలికపాటి వర్షాలు: వాతావరణశాఖ

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.



**హైదరాబాద్, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బుధవారం పలు జిల్లాల్లో ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే ఐదు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉండే అవకాశం ఉ ందని వాతావారణ శాఖ పేర్కొంది. దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరం వద్ద, పశ్చిమ మధ్య అల్పపీడన ప్రభావం కొనసాగుతోందని తెలిపింది. దీని అనుబంధ చక్రవాతపు ఆవర్తనం ప్రస్తుతం సగటు సముద్ర మట్టానికి 4.5 కి.మీ. ఎత్తు వరకు విస్తరించిందన్నారు. ఇది పశ్చిమ నైరుతి దిశలో ప్రయాణించి రాగల 24 గంటల్లో అదే ప్రాంతంలో అల్పపీడనంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# విజయవాడ కోర్టుకు హాజరైన ఏపీ, తెలంగాణ నేతలు

ఉమ్మడి రాష్ట్రంలోని ఓబులాపురం గనుల్లో 2007 జులై 21న అక్రమ మైనింగ్ పరిశీలనకు వెళ్లిన వారిపై నమోదైన కేసుకు సంబంధించిన విచారణను విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు జనవరి 8వ తేదీకి వాయిదా వేసింది.



**విజయవాడ, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** ఉమ్మడి రాష్ట్రంలో ఓబులాపురం గనుల్లో 2007 జులై 21న అక్రమ మైనింగ్ పరిశీలనకు వెళ్లిన వారిపై నమోదైన కేసుకు సంబంధించిన విచారణను విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు వచ్చే ఏడాది జనవరి 8వ తేదీకి వాయిదా వేసింది. 21 మందిపై కేసు నమోదు చేయగా.. అందులో ముగ్గురు కేసు విచారణ దశలో ఉండగానే మృతి చెందారు.మిగిలిన అందరూ ఇవాళ విచారణకు హాజరుకావాల్సిందేనని గత విచారణ సమయంలో న్యాయాధికారి ఆదేశించారు. దీంతో అభియోగాలు నమోదైన ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు నాగం జనార్ధన్రెడ్డి, ఎర్రబెల్లి దయకర్రావు, దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మకాయలచినరాజప్ప, పడాల అరుణ, అమర్నాథ్ రెడ్డి, వేం నరేందర్రెడ్డి, చిన్నం బాబురమేష్, కోళ్ల లలితకుమారి, బొమ్మిడి నారాయణరావు, మసాల పద్మజ, పూల నాగరాజు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, గురుమూర్తి, మెట్టు గోవిందరెడ్డి, యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ ఇవాళ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ముందు హాజ-రయ్యారు.2007 జులై 21న అనంతపురం జిల్లా డి. హీరేహాళ్ మండలంలోని ఓబులాపురం ఇనుప గనుల పరిశీలనకు అప్పటి తెలుగుదేశం నేతలు ఓ బృందంగా వెళ్లినప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు పేర్కొన్న అంశాలపై అభియోగాలు ఎదుర్కొంటున్న నేతల నుంచి 313 స్టేట్మెంట్ను న్యాయాధికారి రికార్డు చేశారు. తమపై తప్పుడు కేసు బనాయించారని, ఎఫ్ఐఆర్లో పొందుపరిచిన విధంగా తాము ఎక్కడా ఎలాంటి నేరానికి పాల్పడలేదని న్యాయాధికారి ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. న్యాయస్థానంపై విశ్వాసం ఉ ందని, కచ్చితంగా న్యాయం గెలుస్తుందని విచారణ అనంతరం అభియోగాలు ఎదుర్కొంటున్న నేతలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీలో బలమైన నేతల్లో ఒకరైన నాగం జనార్ధన్రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్రావు తదితరులు కోర్టు కేసులో భాగంగా రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ రావడం, పాత మిత్రులను కలుసుకున్న తరుణంలో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుని తాజా పరిణామాలపై చర్చించుకున్నారు.

# ఎస్బిఐ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలకు ప్రీస్కూల్ మెటీరియల్ వితరణ




**నంద్యాల బొమ్మలసత్రం డిసెంబర్ 24 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల టౌన్ సెంటర్లో వి సీ. కాలనీ 2,3,నీ వర్తి నగర్ అంగన్వాడీ కేంద్రాలలో ఎస్ బి ఐపాన్ ఇండియ సీ ఎస్ ఆర్ యాక్టివిటీస్ అప్గ్రేడిన్ అంగన్వాడి సెంటసర్స్అమరవతి సర్కిల్ ఏపీ ఇంపుల్మెంటెడ్ బైమిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీల చైర్మన్ లక్ష్మి సి డీ పీ ఓ ఆధ్వర్యంలో జరిగినది .ఒక లక్ష రూపాయల విలువగల ప్రీస్కూలు మెటీరియల్ ఇవ్వడం జరిగింది వాటర్ ఫిల్టర్, రైస్ కుక్కర్ టెలివైసన్. ప్లేట్లు, గ్లాస్ లో జారు సీసాలు, బాస్కెట్ బాల్, బుక్స్, పలకలు, స్కూల్ బ్యాగ్ లు, చాపలు, రాక్ ఇంకా చాలా ఎక్కువ వస్తువులు అందజేశారు.తల్లులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించడం అయినది సూపర్వైజర్ నజీరా సుజాత మహిళా పోలీస్ అంగన్వాడి టీచర్లు అంగన్వాడీ హెల్పర్లు పాల్గొనడం అయినది.

# కేసీఆర్, హరీశ్ రావుకు హైకోర్టులో ఊరట

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రి హరీశ్రావు లకు హైకోర్టులో ఊరట లభించింది.




**హైదరాబాద్, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ , మాజీ మంత్రి హరీశ్రరావు లకు హైకోర్టులో ఊరట లభించింది. భూపాలపల్లి జిల్లా సెషన్స్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కోర్టు సస్పెండ్ చేసింది. జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలు సరిగా లేవని న్యాయమూర్తి పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్ కుంగడంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు క్రిమినల్ రివిజన్ పిటిషన్ విచారణ చేపట్టింది. దీనిని సస్పెండ్ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లా కోర్టులో పిటిషన్ వేసిన రాజలింగమూర్తికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ఈ అంశంలో జిల్లా కోర్టుకు విచారణ పరిధి లేదని కేసీఆర్, హరీశ్ రావు తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ మేరకు హైకోర్టు, సుప్రీంకోర్టు సైతం తీర్పులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టుజజ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సెషన్స్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సస్పెండ్ చేసింది. తదుపరి విచారణను జనవరి 7కు వాయిదా వేసింది.

# అంబేడ్కర్ ను అవమానించింది కాంగ్రెస్సే : పురందేశ్వరి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను తీవ్రంగా అవమానించిన పార్టీ కాంగ్రెస్సేనని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి విమర్శించారు.



**రాజమహేంద్రవరం, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను తీవ్రంగా అవమానించిన పార్టీ కాంగ్రెస్సేనని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి విమర్శించారు. రెండు సార్లు ఎన్నికల్లో ఓడించి పార్లమెంట్లో అడుగు పెట్టకుండా ఆయన్ను మానసిక క్షోభకు గురిచేశారన్నారు. రాజమహేంద్రవరంలో మీడియాతో పురందేశ్వరి మాట్లాడారు.వాజ్పేయి ప్రధానిగా ఉన్న సమ-యంలో అంబేడ్కర్కు భారతరత్న పురస్కారం ప్రకటించామని గుర్తుచేశారు. అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించింది భాజపా అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా భాజపా సభ్యత్వాలు నమోదవుతున్నాయని చెప్పారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో పూర్తి విచారణ జరగాల్సి ఉందని.. అక్కడ మరింత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని పురందేశ్వరి అభిప్రాయపడ్డారు.

# సంధ్య థియేటర్ ఘటనను రాజకీయం చేయడం మానుకోవాలి: డీకే అరుణ

సంధ్య థియేటర్ తొక్కిసలాట దుర్ఘటన అంశాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో సినీ పరిశ్రమపై ప్రభుత్వ వేధింపులుగా భావించాల్సి వస్తుందని భాజపా ఎంపీ డీకే అరుణ అన్నారు.



**రెజిమెంటల్ బజార్, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** సంధ్య థియేటర్ తొక్కిసలాట దుర్ఘటన అంశాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో సినీ పరిశ్రమపై ప్రభుత్వ వేధింపులుగా భావించాల్సి వస్తుందని భాజపా ఎంపీ డీకే అరుణ అన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అభిమానులుగా వెళ్లిన కుటుంబంలో తల్లి రేవతి చనిపోవడం, కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం బాధాకరమన్నారు. సినీ పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉండాలన్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో ఆలోచించకుండా ముగింపు పలకాలని కోరారు.

# రౌడీయిజాన్ని ప్రోత్సహించే సినిమాలకు అనుమతులు ఇవ్వొద్దు: కూనంనేని

సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు.




**హైదరాబాద్, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉ న్నప్పటికీ క్రమంగా కోలుకుంటున్నట్లు వైద్యులు చెప్పినట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ "ఘటన జరిగిన వెంటనే పోలీసులు సీపీఆర్ చేయడంతో బాబు ప్రాణాలు దక్కాయని వైద్యులు చెప్పారు. సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య వివాదంగా ఈ అంశం మారింది. ఈ అంశాన్ని రాజకీయం చేయడం మానుకోవాలి. సినిమా రంగంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. సినిమాల్లో విలన్లను హీరోలుగా చిత్రీకరించే పద్ధతిలో మార్పు రావాలి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వివరించారు. బౌన్సర్లు గూండాల మాదిరిగా వ్యవహరించడం మూలంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.ఈ వ్యవస్థను రద్దు చేయాలని కమ్యూనిస్టు పార్టీ తరపున విజ్ఞప్తి చేస-్తున్నాం. సామాజిక సందేశాత్మక చిత్రాలకు సెన్సార్ బోర్డు అనుమతులు ఇవ్వకుండా.. పోలీసు వ్యవస్థను అణచివేసే విధంగా రౌడీయిజాన్ని ప్రోత్సహించే సినిమాలకు అనుమతులు ఇవ్వడం శోచనీయం" అని పేర్కొన్నారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు .. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి దుర్మరణం

శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. కంచిలి మండలం జక్కర సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు.



**కంచిలి గ్రామీణం, డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. కంచిలి మండలం జక్కర సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. ఒకరు ఘటనాస్థలంలోనే మృతిచెందగా.. సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఇద్దరు చనిపోయా-రు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మొక్కు తీర్చుకునేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరగడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నంలోని సీతమ్మధారకు చెందిన ముత్తా వెంకట రంగ రాజేశ్ కుటుంబం ఒడిశాలోని జాజిపూర్ ఆలయానికి మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు బయల్దేరింది. భార్య లావణ్య, కుమార్తె నేహా గుప్తాతో పాటు తెలంగాణలోని భద్రాచలం ప్రాంతానికి చెందిన తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు కుటుంబంతో కలిసి రాజేశ్ కారులో వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో కంచిలి మండలం జక్కర సమీపంలో విద్యుత్ స్తంభాన్ని వారి వాహనం ఢీకొట్టింది. దీంతో లావణ్య (43), నేహా గుప్తా (18), సోమేశ్వరరావు (49) చనిపోయారు. వెంకట రంగరాజేశ్తో పాటు సోమేశ్వరరావు భార్య రాధిక, తల్లి సుబ్బలక్ష్మికి గాయాలయ్యాయి.క్షతగాత్రులకు సోంపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. వీరిలో రాధిక పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుమార్తె నేహా గుప్తాకు ఐఐటీలో సీటు వచ్చిన సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు వెంకట రంగరాజేశ్ కుటుంబం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కంచిలి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కారు అతివేగంతో వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అమిత్ వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ర్యాలీ

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్రమంత్రి అమిత్ వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు.



**హైదరాబాద్ . డిసెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పైకేంద్రమంత్రి అమిత్ వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ట్యాంక్బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముఖ్యనేతలు కొప్పుల రాజు, అనిల్ కుమార్, వీహెచ్, రోహిన్రెడ్డితో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నేడు కాంగ్రెస్ నేతలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్లో రాష్ట్ర నేతలు నిరసన చేపట్టారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఆటలో ఓడితే చంపేస్తారు.. 'స్క్విడ్ గేమ్ 2' వచ్చేస్తోంది!


**ఓటీటీ ప్రేక్షకులను విశేషంగా అలరించిన 'స్క్విడ్ గేమ్'కు కొనసాగింపుగా సీజన్-2 త్వరలోనే విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తొలి సీజన్ కథేంటి? ఎలా ఉంది?**




ఏదైనా ఆటలో ఓడిపోతే, మళ్లీ ఆడి గెలవచ్చు.. కొన్ని ఆటలు గెలిచే వరకూ ఆడవచ్చు.. కానీ, 'స్క్విడ్ గేమ్'లో ఓడిపోతే, ఎలిమినేట్ అయిపోతారు. ఆటలోనే కాదు, భూమ్మీద నుంచి శాశ్వతంగా. 'డబ్బు' కొందరికి అవసరం.. మరికొందరికి వ్యసనం.. ఇంకొందరికి వినోదం.. ఈ మూడు కలిసిన వెబ్సిరీస్ 'స్క్విడ్ గేమ్' . 2021లో నెటిక్స్ వేదికగా స్ట్రీమింగ్కు వచ్చిన ఈ థ్రిల్లర్ విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. అంతేకాదు, వివిధ అవార్డులను సైతం అందుకుంది. ఇప్పుడు మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. తొలి భాగానికి సీక్వెల్గా 'స్క్విడ్ గేమ్ 2' డిసెంబరు 26వ తేదీ నుంచి నెటిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ప్రపంచవ్యాప్తంగా అలరించిన తొలిభాగంలో ఏం జరిగింది. ఈ కొరియన్ థ్రిల్లర్ జనాలకు నచ్చడానికి కారణమేంటి? దీన్ని తెరకెక్కించేందుకు దర్శకుడు పడిన కష్టాలేంటి?జీవితంలో సర్వస్వం కోల్పోయి, అప్పుల పాలైన 456 మందిని ఒక రహస్య దీవికి తీసుకెళ్తారు. అక్కడ రెడ్లైట్ గ్రీన్లైట్, గోలీలాట, టగ్ ఆఫ్ వార్ లాంటి చిన్నపిల్లలు ఆడుకొనే ఆటల పోటీలు నిర్వహిస్తారు. ఇలాంటివి మొత్తం ఆరు పోటీలుంటాయి. వీటిలో విజేతలుగా నిలిచిన వారికి మొత్తం 45.6 బిలియన్ కొరియన్ వన్ (39 మిలియన్ డాలర్లు) గెలుచుకోవచ్చు. అన్ని సులభమైనవి, సరళమైన ఆటలే. కానీ, ఇక్కడే ఒక చిక్కుంది. ఈ ఆటలో ఓడిపోయినవారు పోటీ నుంచి శాశ్వతంగా ఎలిమినేట్ అవుతారు. ఆటలోంచే కాదు, జీవితం నుంచే ఎలిమినేట్ అవ్వాల్సి ఉంటుంది. అంటే ఓడిపోతే చంపేస్తారని అర్థం. మొదటి ఆట ఆడితే కానీ ఈ విషయం వారికి తెలియదు. అలాంటి ప్రాణాంతకమైన ఆరు ఆటలను దిగ్విజయంగా పూర్తిచేసుకొని చివరకు ప్రైజ్మనీ గెలిచింది ఎవరు? అనేది చివరి వరకు ఆసక్తికరం. కథనం వీక్షకుడికి ఊపిరాడనివ్వదు. చివరి దాకా ఉత్కంఠ రేపే కథనంతో థ్రిల్ గురిచేస్తుంది.ఈ ఆటలో పాల్గొనే పోటీదారులకు వాస్తవ జీవితంలో గడ్డు పరిస్థితులుంటాయి. ప్రధాన పాత్రైన షియెంగ్ జీ హున్కి భార్యతో విడాకులు అవుతాయి. ఉద్యోగం పోతుంది. లెక్కలేనంత అప్పులు చేస్తాడు. దీనికి తోడు జూదం అతడికి వ్యసనం. అందులోనూ డబ్బులు పోగొట్టుకుంటాడు. రెండో వివాహం చేసుకున్న అతడి భార్య.. కూతురిని కూడా తనతో పాటే అమెరికా తీసుకెళ్లాలనే ప్రయత్నంలో ఉంటుంది. కూతురిని తన సంరక్షణలోకి తెచ్చుకోడానికి డబ్బు కావాలి. అప్పు ఇచ్చినవాళ్ల నుంచి బెదిరింపులు, కూతురు తనకు దక్కదేమోనన్న భయం.. ఈ రెండు కారణాలతో ప్రమాదకరమైన 'స్క్విడ్గేమ్' ఆటలోకి అడుగుపెడతాడు. అక్కడ తన క్లాస్మేట్ సాంగ్ వూ కలుస్తాడు. ఒంటరిగా పోరాటం చేయడం కన్నా.. కలిసికట్టుగా ఆడితే విజయం సాధించొచ్చని ఇతర ఆటగాళ్లు అలీ, ఇల్ నామ్, యోంగ్-షుతో కలిసి జట్టుగా ఏర్పడతారు. ఈ పోరాటంలో ఒకరికొకరు అండగా నిలబడతారు. కొన్నిసార్లు సొంతవాళ్లనే మోసం చేసుకొనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా స్నేహం, సహకారం, మోసం, త్యాగాలతో వెబ్ సిరీస్ ఆద్యంతం భావోద్వేగాల ప్రయాణంలా సాగి చూసే ప్రేక్షకుడికి కళ్లని తడిపేస్తుంది. ఈ పాత్రలన్నీ మన చుట్టూ కనిపించే మనుషుల్లాగే ఉండడం కూడా ఈ వెబ్ సిరీస్ విజయానికి మరో కారణం.పూర్వం గ్లాడియేటర్ యుద్ధాల గురించి మనకు తెలిసిందే. రాజులు, చక్రవర్తులు వినోదం కోసం బానిసలతో చావు ఆట ఆడేవారు. దానికి ఆధునిక రూపమే ఇది. ప్రపంచంలోనే అత్యంత సంపన్నులైన బిలియనీర్లు ఈ ఆటను వినోదం కోసం సృష్టించుకుంటారు. ఇందులో అప్పులపాలైన సామాన్యులే వారికి పావులు. డబ్బుల కోసం వాళ్లు కొట్టుకు చస్తుంటే.. అందులో ఆనందాన్ని వెతుక్కుంటారు. కావాల్సినంత డబ్బు సంపాదించిన తర్వాత బోర్ కొట్టి ఇలాంటి హింసాత్మక పోటీని ఏర్పాటు చేస్తారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక రహస్య దీవిని ఎంచుకుంటారు. పోటీల కోసం విశాలమైన మైదానాలను అన్ని హంగులతో భారీగా నిర్మిస్తారు. తొలుత ఎంతో అందంగా, స్వర్గంలో ఉన్నట్లు కనిపించే ఆ ప్రదేశం... ఆ తర్వాత పోటీదారులు నెత్తుటితో తడిసి నరకం కన్నా భయంకరమైన ప్రదేశంగా మారుతుంది.ఓటీటీ వీక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్న ఈ వెబ్సిరీస్.. దృశ్యరూపం దాల్చడానికి మాత్రం అనేక కష్టాలు ఎదుర్కొంది. దీన్ని దక్షిణ కొరియా దర్శకుడు హ్వాంగ్ డాంగ్ హ్యుక్ తెరకెక్కించాడు. 'స్క్విడ్రోమ్' కథను 2009లోనే రాసుకున్నాడు. వెబ్ సిరీస్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు మాత్రం పదేళ్లు పట్టింది. ఇంత కాలం పట్టడానికి ఆర్థికంగా ఆయనను వెంటాడిన కష్టాలు కూడా కారణమే. డబ్బుల్లేక ల్యాప్టాప్ అమ్మేసి జీవితాన్ని నెట్టికొచ్చిన సందర్భాలున్నాయి. స్క్రిప్ట్ ఏ స్టూడియోకి వెళ్లినా తిరస్కరణే ఎదురయ్యేది. 'చిన్నపిల్లల ఆటను ఎవరు చూస్తారు' అని మొహం మీదే తలుపులేసిన వారున్నారు. నిజజీవితంలో ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలు దీన్ని మరింత బలంగా రాయడానికి తోడ్పడ్డాయి. ఇప్పుడు తొలి సీజన్కు కొనసాగింపుగా 'స్క్విడ్ గేమ్ 2' స్ట్రీమింగ్కు సిద్ధమైంది. ఆటకు మీరు సిద్ధమా?

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1924 : హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషల సినిమా నేపథ్యగాయకుడు మహమ్మద్ రఫీ జననం (మ.1980).
- 1932 : ఇంగ్లాండుకు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు కొలిన్ కౌడ్రి జననం (మ.2000).
- 1956 : భారతీయ నటుడు, నిర్మాత అనిల్ కపూర్ జననం. (చిత్రంలో)
- 1973 : అమెరికన్ రచయిత్రి స్టెఫెనీ మేయర్ జననం.
- 1987 : తమిళనాడు రాజకీయాలను మలుపుతిప్పిన ఎం.జి.రామచంద్రన్ మరణం (జ.1917).
- 2005 : ప్రముఖ బహుభాషా చలచిత్ర నటి, దర్శకురాలు, నిర్మాత, స్టూడియో అధినేత్రి, రచయిత్రి, సంగీత దర్శకురాలు, గాయని, పద్మశ్రీ భానుమతీ రామకృష్ణ మరణం (జ.1926)


మహమ్మద్ రఫీ


కొలిన్ కౌడ్రి


అనిల్ కపూర్


స్టెఫెనీ మేయర్



ఎం.జి.రామచంద్రన్


పద్మశ్రీ భానుమతీ

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న నా భార్యకు ముద్దులు విసరలేదు: అశ్విన్

**ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన రవిచంద్రన్ అశ్విన్ తన బయోగ్రఫీలోని పలు విషయాలను ఓ పాడ్కాస్ట్లో పంచుకున్నాడు.**



రవిచంద్రన్ అశ్విన్ ఇటీవల అంతర్జాతీయ క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తన ఆటతీరుతో అభిమానులను అలరించిన అశ్విన్ మంచి మాటకారి. మీడియాతో మాట్లాడినప్పుడు గానీ, యూట్యూబ్ ఛానల్లో అభిమానులతో ముచ్చటించినపుడు గానీ సరదాగా సమాధానాలు చెబుతూ ఆట పట్టిస్తుంటాడు. ఈ క్రమంలోనే 'ఐ హావ్ ది స్ట్రీట్స్: ఎ కుట్టి క్రికెట్ స్టోరీ' అని తన బయోగ్రఫీని ఈ ఏడాది జులైలో విడుదల చేశాడు. రిటైర్మెంట్ ప్రకటించిన సందర్భంగా బయోగ్రఫీలోని మరిన్ని విషయాల గురించి చెప్పాలని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకేల్ అథర్టన్ ఓ పాడ్కాస్ట్లో అశ్విన్ను అడిగారు. క్రికెటర్గా కొనసాగినప్పుడు తనకు ఆశించినంత గుర్తింపు రాలేదని అశ్విన్ పేర్కొన్నాడు. ప్రజలు తాను సీరియస్ గా ఉంటానని భావించారని, విరాట్ కోహ్లి లాగా తాను ఆటను ఆస్వాదించలేదని అశ్విన్ వివరించాడు.'నేను వికెట్ తీసిన ప్రతిసారీ విరాట్ సంబరాలు అందరినీ ఆకర్షిస్తాయి. దీంతో నేను సీరియస్.. విరాట్ సరదాగా ఉంటాడనే భావన ఏర్పడింది. నువ్వెందుకు ఎప్పుడూ సీరియస్ గా ఉంటావు..? అని ఒకరు నన్ను అడిగారు. దానికి మొదట నా సమాధానం ఏమిటంటే. నేను అసలు సీరియస్ గా ఉండే వ్యక్తిని కాదు. కానీ, ఏ జట్టుతోనైనా తలపడే సమయంలో.. నా చేతిలో బంతి ఉంటే దేశం కోసం విజయం సాధించడం పైనే నా దృష్టి ఉంటుంది. ఆ క్రమంలో మరే ఆలోచన నా మెదడులో ఉండదు. ఐదు వికెట్లు తీసి ఘనత సాధించినప్పుడు లేదా బ్యాటింగ్ లో రాణించిన సమయంలో ఎక్కువగా సంబరాలు చేసుకోను. అరుదైన ఫీట్లు సాధించినప్పుడు అతి చేయడం నాకు నచ్చదు. డ్రెస్సింగ్ రూమ్లో ఉన్న నా భార్యకు ముద్దులు విసరలేదు' అని అశ్విన్ పేర్కొన్నాడు.

## ఆరోగ్యం




ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు పెద్దలు. అంతేకాకుండా ఆరోగ్యంగా ఉండటం కోసం ఆకుపచ్చ కూరగాయలు తినమని చాలా మంది సలహా ఇస్తారు. కూరగాయల్లో బోలెడు పోషకాలు ఉంటాయి. అలాంటి వాటిలో బెండకాయ ఒకటి. అయితే, ఇది జిగురుగా ఉంటుందని చాలా మంది తినడానికి ఇష్టపడరు. అయితే, మరికొందరు మాత్రం దీనిని ఇష్టంగా తింటారు. ఈ కూరగాయలో విటమిన్ కె, సి, ఫోలేట్, మెగ్నీషియం, విటమిన్ బి, మాంగనీస్ వంటి పోషకాలు శరీరానికి అవసరమైన పోషణను అందిస్తాయి. బెండకాయలో కాల్షియం, విటమిన్ కె ఎక్కువగా ఉంటాయి. ఇవి తినడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. ఇది ఇమ్యూనిటీ పవర్ పెంచుతుంది. అయితే, బెండకాయతో పాటు కొన్ని ఫుడ్స్ కలిపి తీసుకోకూడదు. ఇవి ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం

# పొరపాటున కూడా బెండకాయను వీటితో కలిపి తినొద్దు ..కడుపులో చికాకుతో పాటు కిడ్నీలో రాళ్లు వస్తాయి..

### పాలు..



బెండకాయ తిన్న తర్వాత పాలు తాగకూడదు. లేదా బెండకాయతో పాటు పాలు తాగకూడదు. ఎందుకంటే ఈ రెండింటిలో కాల్షియం ఉంటుంది. అదే బెండకాయలో కాల్షియంతో పాటు ఆక్సలేట్ కూడా ఉంటుంది. పాలు, బెండకాయలు రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల ఆక్సలేట్‌ను ఏర్పరుస్తాయి. ఇది మూత్రపిండాల్లో రాళ్లను ఏర్పరుస్తాయి. అందుకే ఈ రెండింటి కాంబినేషన్ వద్దంటున్నారు నిపుణులు. వేరు వేరుగా తీసుకుంటే శరీరానికి బోలెడు ప్రయోజనాలు అందుతాయి.

### కాకరకాయ..



కాకరకాయ, బెండకాయ సాధారణంగా రెండు పోషకాలు ఉన్న కూరగాయలు. అయితే, ఈ రెండింటిని కలిపి మాత్రం తినకూడదు. ఈ కాంబినేషన్ కడుపులో చికాకు కలిగిస్తుంది. జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారు ఈ రెండింటిని తింటే చాలా సమస్యలు వస్తాయి. సాధారణంగా కాకరకారయ వేడి స్వభావం కలిగి ఉంటుంది. అదే బెండకాయ చల్లటి స్వభావం. దీంతో కడుపు యొక్క బ్యాలెన్స్ భంగం కలుగుతుంది. దీంతో.. మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్, డయేరియా, కడుపు నొప్పి వంటి జీర్ణ సమస్యలు వస్తాయి.

### టీ..



చాలా మంది టిఫెన్ లేదా భోజనం తర్వాత టీ తాగుతుంటారు. అలాంటి సమయాల్లో మీరు బెండకాయ తిని ఉంటే మాత్రం టీ జోలికి పోకండి. ఈ రెండింటి కాంబినేషన్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు. టీ అనేది టానిన్ రిచ్ ఫుడ్. బెండకాయ తిన్న తర్వాత టీ తాగడం వల్ల పోషకాల శోషణకు ఆటంకం కలుగుతుంది. దీంతో.. శరీరానికి కావాల్సిన పోషకాలు అందవు.

### ముల్లంగి..



ముల్లంగిని బెండకాయను కలిపి ఏ రూపంలోనూ తినకూడదు. ముఖ్యంగా గ్యాస్ సమస్యలతో బాధపడేవారు ఈ ఫుడ్ కాంబినేషన్‌కి దూరంగా ఉండాలి. ఈ రెండింటిని తినడం వల్ల పొట్టలో ఎసిడిటీ ఏర్పడుతుంది. ముల్లంగిలో సల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి. బెండకాయతో తినడం వల్ల ఇవి రెట్టింపు అవుతాయి. దీంతో కడుపులో గ్యాస్ సమస్య పెరుగుతుంది. కడుపు నొప్పి, వాంతులు, పుల్లటి తేన్పులు వంటి సమస్యలతో బాధపడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### రెడ్ మీట్..



బెండకాయ, రెడ్ మీట్ రెండూ కలిపి తినకూడదు. ఈ రెండూ ఆహారాలు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందుకే బెండకాయతో కలిపి రెట్ మీట్ తినకూడదు. ఈ రెండు కలిపి తినడం వల్ల జీర్ణక్రియ ప్రభావితం అవుతుంది. దీంతో.. కడుపులో చికాకుతో పాటు అనేక సమస్యలు వస్తాయి. అందుకే ఈ ఫుడ్ కాంబినేషన్‌కి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

### బెండకాయలు ఎక్కువగా తింటే డేంజర్....



ఇక, బెండకాయల్ని మితంగా తింటే ఆరోగ్యానికి మంచిది. ఎక్కువగా తింటే చాలా ప్రమాదమంటున్నారు నిపుణులు. బెండకాయను ఎక్కువగా తినడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. మోకాళ్ల నొప్పితో బాధపడేవారు పొరపాటున వీటిని ఎక్కువ తింటే వాళ్ల నొప్పులు ఇంకా తీవ్రమయ్యే ఛాన్స్ ఉంది. హై బీపీ సమస్యలతో బాధపడేవారు కూడా బెండకాయల్ని ఎక్కువగా తినకూడదు. ఇది బీపీ సమస్యను ఎక్కువ చేస్తుంది.గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.